క్లుప్తంగా

కారుణ్య నియామక పత్రం అందజేత


నాగబాబుకు ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ మందాలపు నాగలక్ష్మి మృతి చెందిన నేపథ్యంలో ఆమె భర్త పండెం నాగబాబుకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి కారుణ్య నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

చేనేత మహిళలకు చీరల పంపిణీ

కడియం: మండలంలోని పొట్టిలంకలో శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ఆధ్వర్యంలో మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూటర్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి ముందు పార్కు చేసిన స్కూటర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని కాతేరు గ్రామానికి చెందిన బీరకాయల వెంకట రమణారావు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆయన జూన్ 16వ తేదీ రాత్రి ఇంటి ముందు స్కూటర్‌ను పార్క్ చేశారు. తర్వాత రోజు ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్


జగనన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ తిలక్

నిడదవోలు: శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణిచివేసేందుకు పట్టణంలోని జగనన్న కాలనీలో శుక్రవారం వేకువజామున నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాలతో పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది సంయుక్తంగా ఇంటింటా తనిఖీలు చేపట్టారు. మద్యం, సారా, గంజాయి, మందుగుండు సామగ్రి, అక్రమ నిల్వలపై క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఈ సోదాల్లో రికార్డులు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సీఐ తిలక్ మాట్లాడుతూ, సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేరగాళ్లు తమ కార్యకలాపాలను మానుకోవాలని సూచించారు. అనుమానితుల కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సేవనం, విక్రయాలు, రవాణా చేసే వారిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టామన్నారు.

వేద పండితుని నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితుడిగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సాయంతో నెలకు రూ.22 వేల చొప్పున ఇస్తారని చెప్పారు. శుక్లయజుర్వేదం కానీ, కృష్ణ యజుర్వేదం కానీ వచ్చిన వారు అర్చకులుగా చేసేందుకు అర్హులని తెలిపారు. ఈ నెల 28వ తేదీలోపు తిరుమల తిరుపతి దేవస్థానానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సినిమాలు

శ్యామల	:	బకాసుర రెస్టారెంట్
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	కింగ్‌డమ్
స్వామి	:	హరిహర వీరమల్లు
అనుశ్రీ	:	సు ఫ్రమ్ సో
శివజ్యోతి	:	సార్ మేడమ్
రాజా	:	కింగ్‌డమ్
ఊర్వశి	:	మహావతార్ నరసింహ
మేనక	:	రాజుగాని సవాల్
రంభ	:	జూనియర్
అప్సర	:	కింగ్‌డమ్
అశోక	:	కింగ్‌డమ్
నామవరం		
వీఎస్ మహల్	:	మహావతార్ నరసింహ
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మహావతార్ నరసింహ
కడియం		
వెంకటసూర్య	:	మహావతార్ నరసింహ

ఆప్యాయతల రక్షాబంధన్

- సోదర ప్రేమకు ప్రతీక
- నేడు రాఖీ పౌర్ణమి

రాజమహేంద్రవరం రూరల్: అనురాగం, ఆప్యాయతల మేళవింపుగా జరుపుకొనే రక్షాబంధన్ వేడుకకు తోబుట్టువులు ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. ఏటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున రక్షా బంధన్ నిర్వహిస్తారు. శనివారం జరుపుకొనే ఈ పండగకు ఆడపడుచులు పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అన్నదమ్ములకు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటుకుంటారు.

మొదలైన సందడి

అనుబంధాలకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చే హిందూ సంస్కృతిలో రక్షాబంధన్‌కు విశిష్టమైన స్థానం ఉంది. అన్నాచెల్లెళ్ల అనురాగానికి చిహ్నంగా ఈ వేడుక జరుపుకుంటారు. ఇళ్లలోనే కాకుండా ఆలయాల్లో, సామూహిక వేదికల వద్ద ఈ పర్వదినాన్ని ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకోనున్నారు. బాలికలు, యువతులు, మహిళలు అంతా ఈ వేడుకను నిర్వహించేందుకు నాలుగు రోజుల ముందు నుంచే ఉత్సాహంగా రాఖీలు కొనుగోలు చేయడం మొదలు పెట్టారు.


రాఖీల అమ్మకాలు


బ్యాంకు ఉద్యోగికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి (ఫైల్)

దీక్షా సంకల్పమే రక్ష

ఏదైనా కార్యక్రమం నిర్వహించ తలపెట్టినప్పుడు రక్షను ధరించడం హైందవ ఆచారం. ఆ కార్యక్రమం ఏ విఘ్నాలు లేకుండా సజావుగా సాగాలని, అనుక్షణం లక్ష్యాన్ని గుర్తు చేసేందుకు ఈ రక్షను ధరిస్తారు. వివాహం, యజ్ఞయాగాదులు, వ్రతాలు, నోములు తదితర కార్యక్రమాల్లో ఈ రక్షాధారణ తప్పనిసరి. పూర్వకాలంలో యుద్ధానికి వెళ్లే భర్తలకు భార్యలు, సోదరుల క్షేమాన్ని కాంక్షిస్తూ సోదరీమణులు రక్షలు కట్టేవారు. ఆనాటి నుంచి ఆనవాయితీగా ఈ ఆచారం వస్తోంది.

జోరుగా రాఖీ విక్రయాలు

మార్కెట్‌లో రాఖీల క్రయ విక్రయాలు జోరందుకున్నాయి. మారుతున్న కాలానికి, అభిరుచులకు అనుగుణంగా, దుకాణదారులు పలు డిజైన్లలో రాఖీలను అందుబాటులో ఉంచారు.

భగవంతుడు చూపిన మార్గం



ఈశ్వరుడు మనిషిని ప్రశాంతంగా ఉంచేందుకు ఎన్నో మార్గాలను చూపెట్టాడు. అందులో ఎంతో ప్రాముఖ్యత ఉన్న రక్షా బంధన్ మహోత్సవం ఒక్కటి. కేవలం తోడబుట్టిన వారికి మాత్రమే కాకుండా సృష్టిలోని ప్రతి వ్యక్తిని సోదరభావంతో చూస్తూ అందరికి రాఖీ కట్టడం ద్వారా కొత్త బంధాలను బ్రహ్మకుమారీలు ఏర్పర్చుకుంటున్నారు.

– సిస్టర్ పార్వతి, బ్రహ్మకుమారీ సంస్థ, ఆర్యాపురం, రాజమహేంద్రవరం

క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటన


ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: పింఛన్ పంపిణీ తీరును పరిశీలించేందుకు కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి శనివారం స్థానిక 49వ వార్డులో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని, వారికి సేవలందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, పింఛన్, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మొదలైన పథకాలు అందలేదంటూ పలువురు ప్రజలు తెలిపారు. ఆయా ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, వాటి యథార్థ స్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్ఎంసి అధికారి శైలజావల్లి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, పీడీవోలు పాల్గొన్నారు.

'జానకి రాముల ప్రేమకథ' ప్రీమియర్ షో


ప్రీమియంషోను ప్రారంభిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నవరసాలు పలికించడంలో నటుడు నరవ గోపాలకృష్ణ సిద్ధహస్తులు అని వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యురాలు, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నరవ గోపాలకృష్ణ నిర్మాతగా, ప్రధాన పాత్రలో నటించిన 'రావణ లంకలో జానకి రాముల ప్రేమకథ' సినిమా ప్రీమియర్ షోను గురువారం రాత్రి రాజమహేంద్రవరంలోని సంహిత కల్యాణ మంటపంలో ప్రదర్శించారు. ఈ ప్రీమియర్ షోను జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరవ గోపాలకృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరం నుంచి ఎందరో కళాకారులు, రచయితలు పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. గోదావరి నీరు తాగిన వారు కళా రంగాలలో రాణిస్తారన్నారు. తాను 20 ఏళ్ల వయసులో చిన్న నాటకాలలో ప్రదర్శనలు చేశానన్నారు. ఇక నుంచి పూర్తిస్థాయిలో నటనలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషిచేస్తానని అన్నారు. కథ, స్క్రీన్ ప్లే, దర్శకుడిగా విజయ్ పేరాపు వ్యవహరించారు. జానకి, రాముడిగా నటించిన యువజంట సినిమా పూర్తి అయ్యే సరికి ప్రేమలో పడ్డారని నిర్మాత నరవ గోపాలకృష్ణ తెలిపారు. ఈనెలలోనే వారు భార్యాభర్తలు కాబోతున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లంక సత్యనారాయణ, రెడ్డి రాజు, బెజవాడ రంగారావు, గేడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో నగర క్రీడాకారుల సత్తా


సౌత్ ఇండియా రోల్ బాల్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన క్రీడాకారులు

- పలు పతకాల కైవసం
- జాతీయ పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్: నగర విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ముఖ్యంగా రోల్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి వాటిలో ప్రతిభ చూపి, పతకాలు సాధిస్తున్నారు. మన రాజమహేంద్రవరం ఖ్యాతిని దశ దిశలా వ్యాప్తి చేస్తున్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన 7వ ఆంధ్రప్రదేశ్ రోల్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్–14 బాలికల విభాగంలో, 17 ప్లస్ పురుషుల విభాగంలో సత్తా చాటి కాంస్య పతకాలు సాధించారు. వీరిలో అత్యంత ప్రతిభ కనబరిచిన ధరహాస్, ప్రభాత్, వెనవీర్, రాయుడు, తరుణ్, రిషిక్, జితేంద్ర, విష్ణు, రిత్విక్, కళ్యాణ్, సిద్ధు, కేశవ, అశోక్ తిరుచ్చిలో జరిగే సౌత్ ఇండియా రోల్ బాల్ చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. వీరందరికీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రుద్రశ్రీ మహస్వీ, కార్యదర్శి అప్పారావు అభినందించారు.

సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు మోహిత్

ఏపీ స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2025 పోటీల్లో నగరానికి చెందిన కొత్తపల్లి శ్రీమోహిత్ మెన్స్ సింగిల్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి, సెప్టెంబర్‌లో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం గౌహతిలో శిక్షణ తీసుకుంటున్న శ్రీమోహిత్ నవంబర్‌లో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

కానరాని శిక్షణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా వేసవి క్రీడా శిక్షణ తరగతుల పేరుతో ఒక నెల రోజుల పాటు వివిధ క్రీడల్లో విద్యార్థులకు వారికి నచ్చే ఆటల్లో శిక్షణ ఇచ్చేవారు. వీటితో పాటు స్కూల్ గేమ్స్, ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గత ప్రభుత్వం కృషి చేసింది. కాగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ తరగతులు తూతూమంత్రంగా నిర్వహిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా క్రీడల్లో రాణించడానికి పీడీలు, క్రీడా శిక్షకులు కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడంతో క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు.

శుభప్రదాయిని.. శ్రీమహాలక్ష్మి


ఉమా మార్కండయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీమాతకు గాజుల అలంకరణ


ఏవీ అప్పారావు రోడ్డులోని అష్టలక్ష్మి దేవాలయంలో బారులు తీరిన భక్తులు

- అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాస పూజలు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన పూజలు

సీటీఆర్ఐ: శ్రావణ మాసం మూడో శుక్రవారం కావడంతో నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి, గోదావరి గట్టున ఉన్న శృంగేరి జగద్గురు శారద పీఠం, శంకరమఠంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని మహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. లాలాచెరువు రోడ్డులోని గోవింద క్షేత్రంలో అమ్మవారికి హోమం, అభిషేకాలు నిర్వహించారు. ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవాలయంలో స్వయంభూగా వెలిసిన పార్వతి అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. ఏవీ అప్పారావు రోడ్డులోని అష్టలక్ష్మి దేవాలయం, వంకాయల వారి వీధిలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గాడాలలోని మహాలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కాగా.. పుష్కర, వీఐపీ, సరస్వతి, కోటిలింగాల ఘాట్లలో తెల్లవారుజామునే భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్య స్నానాలు ఆచరించారు.


విశేష అలంకరణలో గాడాలలోని మహాలక్ష్మి అమ్మవారు

అగ్నికుల క్షత్రియులకు రక్షణ కల్పించాలి

తాళ్లపూడి: దుండగుల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ తాళ్లపూడి, పోలవరం, పట్టిసీమ, కొవ్వూరు మండలాల అగ్నికుల క్షత్రియ సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయా సంఘాల ప్రతినిధులు మల్లాడి పోసియ్య, మచ్చా సూరిబాబు, రెవి చిన్నా, లంకె ప్రకాశం, పెమ్మాడి పోసియ్య, పొన్నాడ అన్నవరం తదితరులు తమ సమస్యలు వివరించారు. గోదావరి నది వెంబడి కొవ్వూరు, తాళ్లపూడి, పోలవరం మండలాలకు చెందిన అగ్నికుల క్షత్రియులు నదీ తీరం వెంబడి గ్రామాల పరిధిలో చేపల వేట సాగిస్తుంటారన్నారు. వరదల సమయంలో నిషేధాజ్ఞలు ఉన్నపుడు కూడా యానాం నుంచి వచ్చిన కొంత మంది తమతో గొడవపడి మరీ ప్రమాదకరమైన బ్యారేజ్ ప్రాంతంలో కూడా వేటకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అందువల్ల అధికారులు నిషేధాజ్ఞలు కఠినంగా అమలు చేయాలని కోరారు. అలాగే అక్రమంగా వేటకు వెళ్లే వారిపై, దాడులు జరిపే వారిపై చట్టరీత్యా మత్స్య, పోలీస్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనల ప్రకారం వినాయక చవితి


ఇలపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్ర కుమార్

బిక్కవోలు: నిబంధనల ప్రకారం వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ అన్నారు. మండలంలోని ఇలపల్లి గ్రామస్తులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అశ్లీల కార్యక్రమాలు పెట్టకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఏకో ఫ్రెండ్లీ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, ఐదు అడుగులకు మించి విగ్రహం ఎత్తు ఉండకూడదన్నారు. మైక్, కరెంటు అనుమతులు తీసుకోవాలన్నారు.

కూటమి నాయకుల అసత్య ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై విమర్శలు తగవు
- రాజకీయ కక్షతోనే గుడిసెల తొలగింపు
- విలేకరులతో కుతుకులూరు బాధితులు


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

అనపర్తి: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని లక్ష్యంగా చేసుకుని కుతుకులూరు ఎస్సీపేటకు సంబంధం లేని కొందరు కూటమి నాయకులు సమావేశాలు పెట్టి, అసత్యాలు చెబుతున్నారని ఆ ప్రాంత బాధితులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కుతుకులూరు ఎస్సీపేటలో గత 70 ఏళ్లలో ఇందిరాగాంధీ, ఆ తర్వాత జగన్ ప్రభుత్వంలో డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. యాభై ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లలో కాపురాలు ఉంటున్న తమకు పిల్లల పెళ్లిళ్లు అయ్యి, కుటుంబ సభ్యులు పెరిగారన్నారు. దీంతో కొందరు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పట్టాలిచ్చిన స్థలంలోనూ, మరి కొందరు పశువుల పాకలు, గుడిసెలు వేసుకుని ఉంటున్నామన్నారు. అవి ఎవరికీ అడ్డు కూడా కాదని కావన్నారు. స్థానిక కూటమి నాయకులు రాజకీయ కక్షతో తమ గుడిసెలను కూల్చివేశారన్నారు. ఈ ఘటనతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి సంబంధం లేదని వారు చెబుతున్నారని, నిజంగా సంబంధం లేకపోతే ఇంత వరకు ఈ ప్రాంతానికి వచ్చి ఎందుకు బాధితులను పరామర్శించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు తెలియకుండానే సుమారు 10 మంది ఎస్సైలు, భారీగా పోలీసు సిబ్బంది, పంచాయతీ అధికారులు ఆగమేఘాలపై వచ్చి కూల్చివేశారా అని నిలదీశారు. తమ ఎస్సీ పేటకు సంబంధం లేని వ్యక్తులు ఈ ప్రాంతం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వారికి నిజంగా ఎస్సీ ఏరియా అభివృద్ధిపై శ్రద్ధే ఉంటే స్థానిక టీడీపీ నాయకులు రోడ్లని ఆక్రమించుకుని నిర్మించిన భవనాలు, షెడ్లను తొలగించాలన్నారు.

స్థానిక ఎన్నికలకూ భయపడుతున్న కూటమి

- జగన్‌కు ప్రజాదరణ పెరగడమే కారణం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి



అనపర్తి: మండల, గ్రామ స్థాయి ఎన్నికలు నిర్వహించడానికి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం భయపడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి కూటమి నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. జగన్ మొన్న డోన్ నియోజకవర్గానికి ఓ పెళ్లి కోసం వెళితే ఎంత మంది వచ్చారో రాష్ట్రమంతా చూశారన్నారు. విశాఖపట్నం స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైఎస్సార్ సీపీ విజయం చూస్తే తిరిగి తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనడానికి చిహ్నమన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నిక చాలా చిన్న ఎన్నిక కావచ్చు, కానీ ఇచ్చిన సంకేతం మాత్రం చాలా పెద్దది అన్నారు. ఇలాంటి సంకేతాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయన్నారు. కాబట్టే నిన్న కొండెపిలో బలవంతంగా ఏకగ్రీవం అంటూ ప్రకటించుకున్నారు. కడప స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూడా అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని అధికార పార్టీ దౌర్జన్యం చేశారన్నారు. పులివెందుల జెడ్పీటీసీ కూడా వైఎస్సార్ సీపీకి పక్కాగా రావాల్సిన సీటన్నారు. రౌడీమూకలను పెట్టి విచ్చల విడిగా డబ్బు ఖర్చు పెట్టినా ఒక డీఐజీకి పచ్చ చొక్కా వేసి అక్కడే పెట్టినా జనం మాత్రం జై జగన్ అనే అంటున్నారన్నారు. అది తట్టుకోలేక నిన్న విచ్చలవిడిగా దాడులకు పాల్పడ్డారని, బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై ఏకంగా హత్యాయత్నం చేశారన్నారు. ఒక జెడ్పీటీసీ ఎన్నిక కోసం కూటమి ప్రభుత్వం ఇలా దిగజారిపోయిందన్నారు. పులివెందుల ఉప ఎన్నికల్లో టీడీపీ తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు


ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ నవీన

సీతానగరం: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించడం జరిగిందని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ కె.నవీన తెలిపారు. శుక్రవారం చినకొండేపూడి – 2 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, అవసరమైన పరికరాలు, వాటి నిర్వహణ గురించి నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ టీమ్ వర్చువల్‌గా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ నవీన మాట్లాడుతూ ఈ ఆరోగ్య మందిరాల ద్వారా 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. ఎన్‌క్యూఏఎస్ నుంచి వారం రోజుల్లో చినకొండేపూడి–2 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ధ్రువీకరణ పత్రం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఎం.శైలజా రాణి, టీమ్ మెంబర్ డాక్టర్ ఎస్ సుధలత, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.అరుణ, ఏఎన్ఎం రోజామణి, ఆశావర్కర్లు వి.కుమారి, రామసీత, ఆకాలత పాల్గొన్నారు.